www.vishalabharati.com
epaper:vishalabharati.com
TELANGANA POLITRICKS
పాలిట్రిక్స్
2023-2024
విశాల భారతి
vishalabharathi Telugu Daily
శుక్రవారం, 03.11.2023
హైదరాబాద్
1pm

పాలిట్రిక్స్

తుంగతుర్తి కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించేదెప్పుడు?

- ఎంపిక జాప్యంపై కార్యకర్తలు అయోమయం
- గతంలో ఇలా ఆలస్యం వల్లే ఓడిపోయామని టెన్షన్..
- వెంటనే అభ్యర్థిని ప్రకటించాలని డిమాండ్
- అద్దంకి ఎంపికపై క్యాడర్‌లో అయోమయం?

విశాల భారతి, తుంగతుర్తి:

ఎలక్షన్‌నోటిఫికేషన్ వచ్చి నామినేషన్లు షురూ అయినా.. ఇంకా సూర్యాపేట జిల్లాలో తుంగతుర్తి కాంగ్రెస్ టికెట్ పై సస్పెన్స్ వీడడం లేదు. దీంతో క్యాడర్‌ఆందోళన చెందుతున్నారు. తమకే టికెట్ కేటాయించాలని ఆశావహులు భారీ సంఖ్యలోనే పీసీసీ కి దరఖాస్తు పెట్టుకున్నారు. గతంలోనే తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గతంలో 2014, 2018లో చివరికి ప్రకటించడంతో ఎమ్మెల్యే అభ్యర్థికి సమయం సరిపోక నే తక్కువ ఓట్ల మెజార్టీతో ఓటమిపాలైనట్లు పదేపదే కార్యకర్తల్లో చర్చ జరుగుతుంది. 2023లో జరిగే ఎన్నికల్లోనైనా కాంగ్రెస్ పార్టీ తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి అభ్యర్థిని మొదటి రెండవ జాబితాలో ప్రకటిస్తారని కార్యకర్తలు ఆశించినప్పటికీ అది జరగలేదు. ఆశావహులు భారీ సంఖ్యలో ఉన్నందున అభ్యర్థి ఎంపికలో కాంగ్రెస్ పెద్దలు తర్జన భర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. ఇలానే ఎటూ తెలుసుకోలేని పరిస్థితుల్లో 2023లో సైతం తుది జాబితాలోనే తుంగతుర్తి అభ్యర్థిని ప్రకటించే అవకాశం రావడంతో కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు.

పోటీ దారుల లిస్టు పెద్దదే..

గత ఎన్నికల్లో రెండు పర్యాయాలు పోటీ చేసి ఓడిపోయిన అద్దంకి దయాకర్ తో పాటు తెలంగాణ ఉద్యమకారుడు మందుల సామేలు, ఇటీవల పార్టీలో చేరిన మోత్కుపల్లి నరసింహులు, ఓయూ జేఏసీ ఫౌండర్ చైర్మన్, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి, డాక్టర్ వడ్డేపల్లి రవి, అన్నేపర్తి జ్ఞాన సుందర్, ప్రీతం, క్రిష్ణ వేణి పేర్లు పోటీ దారులుగా సోషల్‌మీడియాలో హల్ చల్‌చేస్తున్నాయి. అయితే అభ్యర్థులను మాత్రం ప్రకటించడం లేదు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎవరికి ఇచ్చినా గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నామని, వెంటనే అభ్యర్థిని తేల్చాల్సిన బాధ్యతను హైకమాండ్ పైన ఉందని క్యాడర్‌చెప్తున్నారు. నిత్యం సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతూ అభ్యర్థిస్తున్నారు.

అద్దంకి టికెట్‌పై అయోమయం..

ఇటీవల పార్టీలో చేరిన మోత్కుపల్లి, మందుల సామేల్‌లో ఒకరికి ఇవ్వాలని సీనియర్ల పట్టు పడుతున్నట్లు తెలుస్తోంది. ఉద్యమకారుడిగా, పార్టీ వాయిస్ వినిపించే బలమైన నేతగాదయాకర్ పేరు హైకమాండ్‌దృష్టిలో ఉన్నా.. ప్రకటించేందుకు తర్జన భర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. 2014, 2018లో పార్టీ అభ్యర్థిగా అద్దంకి దయాకర్ రెండుసార్లు పోటీ చేసి స్వల్ప మెజారిటీతో ఓడిపోయారు. మూడో సారి పోటీకి అద్దంకి రెడీగా ఉన్నా ఆయనకు టికెట్ రాకుండా నల్గొండ జిల్లాకు చెందిన సీనియర్లు అడ్డుపుల్ల వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మునుగోడు బై ఎలక్షన్ టైంలో , అంతకుముందు ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ఇద్దరు సీనియర్ లీడర్లపై తీవ్ర ఆరోపణలు చేయడమే ఇందుకు కారణమనే వాదనలు వినిపిస్తున్నాయి .

ఆలేరులో 'హస్తం' హవా!

- స్పీడందుకున్న కాంగ్రెస్ ప్రచారం
- జోరుగా చేరికలు.. పెరుగుతున్న ప్రజా మద్దతు
- అనునిత్యం జనంలోనే ప్రజానేత బీర్ల ఐలయ్య
- గొంగిడి సునీతకు ప్రభుత్వ వ్యతిరేకత ఎఫెక్ట్
- ఆమెపనితీరుపైనా ఆలేరు ప్రజల అసంతృప్తి
- ఆధిపత్యమే తప్పా.. అభివృద్ధి లేదంటూ అసహనం

విశాల భారతి, స్టేట్‌బ్యూరో ప్రతినిధి:

ఆలేరులో 'హస్తం' హవా పెరిగింది. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో కాంగ్రెస్‌ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తున్నది. ఊరు వాడా హస్తం శ్రేణుల హోరు కనిపిస్తుండగా, నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి బీర్ల ఐలయ్య నిత్యం జనంలోనే కలియదిరుగుతున్నారు. యువతతో మమేకమై ముందుకు సాగిపోతున్నారు. మరోవైపు తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ వైఫల్యాలు, రెండు పర్యాయాలు గెలిపించినా.. నియోజకవర్గ అభివృద్ధిలో విఫలమైన ప్రభుత్వ విఫ్‌గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి పనితనాన్ని నిరసిస్తూ అధికార బీఆర్ఎస్‌తో పాటు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు హస్తం గూటిలో చేరిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆలేరు నియోజకవర్గంలోని పరిస్థితులపై 'విశాల భారతి' విశ్లేషణాత్మక కథనం..

ఆలేరు గత పాలకులు ఇలా..

పోరాట వారసత్వం ఉన్న చైతన్యవంతమైన నేల ఆలేరు. రైతాంగ పోరాటంలో నిజాం సైన్యానికి ఎదురొడ్డి నిలిచి తరిమికొట్టిన చరిత్ర ఈ ప్రాంతానికి ఉంది. పోరాటాల ఖిల్లాగా పేరొందిన ఆలేరు నియోజకవర్గ గతాన్ని గమనిస్తే .. ఇక్కడి నుంచి గెలిచిన పలువురు నాయకులు రాష్ట్ర రాజకీయాల్లో వెలుగొందిన చరిత్ర ఉంది..1957లో ఏర్పడిన ఆలేరు సెగ్మెంట్‌కు తొలి ఎమ్మెల్యే గా ఆరుట్ల కమలాదేవి (పీడీఎఫ్) ఎన్నికయ్యారు. 62లోనూ సీపీఐ నుంచి గెలిచారు. 67,72లో పున్నారెడ్డి, 78లో పోచయ్య విజయం సాధించారు. ఇక 83,85,89,94,99లో మోత్కుపల్లి నర్సింహులు గెలుపొందారు. 2004,08 లో నగేశ్, 09 లో భిక్షమయ్య గౌడ్ ఎన్నికయ్యారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత 2014, 18లో గొంగిడి సునీత గెలుపొందారు.

> **అభివృద్ధి లేకనే 'హస్తం' బాట..**
>
> కానీ ఈ సారి 'హస్తం' హవా వీస్తోంది. దీనికి ముఖ్య కారణం బీఆర్ఎస్ 'మేడిపండు సామెత' అభివృద్ధి, కుటుంబ పాలన, నియోజకవర్గంపై ఒకే కుటుంబం గుత్తాధిపత్యంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో పర్యాటక స్థలాలకు ఆలవాలమైన ఆలేరును ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి చేస్తారనుకుంటే సమస్యల నిలయంగా మార్చారని నియోజకవర్గాల వాసులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. రాష్ట్రం వస్తే ప్రజలు బాగుపడుతారనుకుంటే ఆలేరులో ఎమ్మెల్యే 'గొంగిడి' దంపతులే బాగు పడ్డారు తప్పా.. ప్రజలు బాగుపడలేదని మండిపడుతున్నారు. ఆలేరులో అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం .. గంధమల్ల ప్రాజెక్టుల నిర్మాణం ప్రజలు జాయింట్‌యాక్షన్ల పేరుతో ఉద్యమాలు చేసినా.. ఫలితం లేకుండా పోయింది. ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ఇటీవల వరకు ఉద్యమాలు జరిగాయి. నియోజకవర్గంలో ఎక్కడా 'డబుల్' బెడ్‌రూమ్స్‌ఇవ్వలేదని వాపోయారు.

'గొంగిడి' ఆధిపత్యమే తప్పా.. అభివృద్ధి నిల్..

గొంగిడి సునీత ఫస్ట్‌టర్మ్‌లో ఎంతో కొంత పనిచేసినా.. రెండో సారి గెలిచిన తర్వాత ప్రజలను , అభివృద్ధి పనులు పూర్తిగా వదిలేశారన్న మాటలే సర్వత్రా వినిపిస్తున్నాయి. అంతే కాదు నియోజకవర్గంలో ఆమె ఎవరికీ మేలు చేసినట్లుగాని, అలాగని కీడు చేసినట్లు లేదు. కేవలం రియల్‌ఎస్టేట్ వ్యాపారం తప్ప ఈ దఫా విప్ గొంగిడి సునీత పెద్దగా నియోజకవర్గం అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్న అసంతృప్తులే వినిపిస్తున్నాయి. కాకపోతే గొంగడి సునీత చేసిన నియోజకవర్గ అభివృద్ధి గురించి చెప్పాల్సి వస్తే, ఒక్క యాదగిరి గుట్ట పునర్నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించడం తప్పా, ప్రత్యేకించి చెప్పుకోవడానికి ఏమీ లేదని కూడా అంటున్నారు. యాదాద్రి పరిసరాల్లో భూముల ధరలు విపరీతంగా పెరిగాయని సంతోషించాలో, లేక సామాన్యలకు అందుబాటులో లేకుండా పోయాయని బాధపడాలో తెలియని పరిస్థితిలో నియోజకవర్గం ఉందంటున్నారు. ఏది ఏమైనా ఆమెపై బహిరంగ విమర్శలు, వివాదాలు లేకపోయినా నియోజకవర్గ అభివృద్ధిలో పూర్తిగా ఫెయిలయ్యారన్న వార్తలు వినిపిస్తున్నాయి.

ప్రజల కష్టసుఖాల్లో అండగా ఐలయ్య..

గత కొన్నేండ్లుగా రాజకీయాలకతీతంగా ఆలేరు ప్రజల కష్టసుఖాల్లో ఐలయ్య అండగా నిలుస్తున్నారు. తన ట్రస్టు ద్వారా ప్రజలకు విశేష సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న అయిలయ్య నియోజకవర్గంలో దూసుకుపోతున్నాడంటే ఆయనకు ప్రజాసేవపై ఉన్న మమకారమే అని ఆయన అనుచరులు చెప్పడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్ అంశాలు మొదలుకొని ఇప్పటి 'ఆరు గ్యారంటీ పథకాలు' గురించి ప్రజలకు వివరించడంలో ఆయన సక్సెస్‌అయ్యారు. ఎలక్షన్లు రాకముందే ఐలయ్య నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో రచ్చబండ ఏర్పాటు చేసుకుంటూ తన ప్రచారం ప్రారంభించారు. పార్టీని వాడుకొని వదిలేసిన, అవకాశ వాదులకన్నా, నిత్యం ప్రజల్లో ఉంటూ అనేక సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న బీర్ల అయిలయ్య ఎమ్మెల్యే అయితే తమకు లాభం జరగుతుందని నియోజకవర్గ ప్రజలు చర్చిస్తున్నట్లు తెలుస్తోంది.

నాయకుడిని కాదు.. ప్రజా సేవకుడిని: బీర్ల ఐలయ్య

రానున్న ఎన్నికల్లో ఆలేరు నుంచి తప్పకుండా విజయం సాధిస్తానని కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల అయిలయ్య ధీమా వ్యక్తం చేశారు. ఆయన 'విశాల భారతి' తో మాట్లాడుతూ ఆలేరు ప్రజల ఆశీర్వాదంతో భారీ మెజార్టీ సాధిస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాన్నన్నారు. నాయకుడిగా కాదు నియోజకవర్గ ప్రజలకు సేవకుడిగా ఉంటానని ఐలయ్య చెప్పారు. ఆలేరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలోకి ప్రజలు చేరుతున్నారన్నారు. ఆలేరు నియోజకవర్గం నుంచే మార్పు మొదలైందన్నారు.

రైతులకు ఉచిత కరెంటు, పెన్షన్ల పథకం, రైతు రుణమాఫీ వంటి పథకాలు పెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. 10 ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. మండలంలో ఒక్క డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కూడా కేటాయించని దుస్థితి దాపురించిందని అన్నారు. ప్రజల సమస్యలు పట్టించుకోకుండా పైపై మెరుగులు చూపించి మేమే అభివృద్ధి చేశామనడం బీఆర్ఎస్ పార్టీకి సిగ్గుచేటు అన్నారు. ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి నిర్లక్ష్యానికి నిదర్శనంగా మండలంలోని రోడ్లు నిలువుటద్దంగా కనబడుతున్నాయన్నారు. రైతు రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని చెప్పి బ్యాంకర్లు రైతులను ఇబ్బందులు పెడుతున్న పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. పేదల సమస్యల పక్షాన పోరాడే కాంగ్రెస్ పార్టీకి ప్రజలందరూ అండగా నిలవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తెచ్చేందుకు ప్రతి ఒక్కరు అంకిత భావంతో కృషి చేయాలని కోరారు.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

- తొలి నామినేషన్ వేసిన 'తుమ్మల'
- ముహూర్తాలు చూసుకుంటున్న అభ్యర్థులు
- 8 రోజుల వ్యవధిలో 4 రోజులే మంచి ముహూర్తాలు

విశాల భారతి, హైదరాబాద్:

ఎన్నికల నోటిఫికేషన్‌విడుదలయ్యింది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. నామినేషన్ల స్వీకరణ కోసం 119 నియోజకవర్గాల్లో ఆఫీసర్లు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. నేటి నుంచి నవంబర్ పది వరకు నామినేషన్ల ప్రక్రియ సాగనుంది. ఈ నెల 13న నామినేషన్ల పరిశీలన చేస్తారు. ఈ నెల 15వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. ఇక, ఈనెల 30న పోలింగ్ నిర్వహించి, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపడతారు.

ముహూర్తం ఎప్పుడు బాగుంది..

శుభ ముహూర్తాల కోసం అభ్యర్థులు పండితులను ఆశ్రయిస్తున్నారు. ఏ రోజు, ఎప్పుడు నామినేషన్ దాఖలు చేస్తే మంచిదో తెలుసుకుంటున్నారు. ఈ ఎనిమిది రోజుల్లో నాలుగు తేదీల్లోనే మంచి ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెప్తున్నారు. ఈ రోజు, రేపు అలాగే 8, 9 తేదీల్లో నామినేషన్లు దాఖలు చేసుకుంటే మంచిదంటున్నారు. ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించింది బీఆర్ఎస్. బీఆర్ఎస్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మూడు అసెంబ్లీ సెగ్మెంట్లలో రోజుకు మూడు సమావేశాల్లో ప్రసంగించడంతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. బీజేపీ తన అభ్యర్థుల మూడో జాబితాను గురువారం విడుదల చేయగా.. మరో రెండు మూడు రోజుల్లో కాంగ్రెస్ తన తదుపరి జాబితాను ప్రకటించనుంది. కాంగ్రెస్‌తో ఎన్నికల పొత్తు ఒప్పందం కుదరకపోవడంతో సీపీఎం ఒంటరిగానే పోటీ చేయాలని నిర్ణయించుకుంది. రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ అగ్రనేతలు రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఇతర నేతలు రానున్న రోజుల్లో బీజేపీ తరఫున ప్రచారం చేయనున్నారు.

హంగూ ఆర్భాటం లేకుండా తుమ్మల నామినేషన్..

ఖమ్మంలో నామినేషన్ దాఖలు చేశారు కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు. నామినేషన్ ప్రక్రియ మొదలైన వెంటనే ఖమ్మం మున్సిపల్ ఆఫీస్‌కి వచ్చిన తుమ్మల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. చాలా సింపుల్‌గా 'తుమ్మల' నామినేషన్ ప్రక్రియ ముగించేశారు. కేవలం ఐదారు మంది అనుచరులతో రెండే రెండు కార్లలో నామినేషన్ వేయడానికి వచ్చారు. ఎలాంటి హడావిడి లేకుండా 'తుమ్మల' నామినేషన్ దాఖలుచేసి వెళ్లారు.

బీసీ ఓటర్లు ఎటుంటరో?

- తెలంగాణలో బీజేపీ బీసీ కార్డు మంత్రం..
- కులగణనను ప్రచారాస్త్రంగా చేసుకున్న కాంగ్రెస్
- తమదీ అదే రాగమంటున్న బీఆర్ఎస్ చీఫ్..
- ఈ ఎన్నికల్లో కీలకంగా మారనున్న బీసీ నినాదం

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

నామినేషన్ల పర్వం మొదలవ్వడంతో తెలంగాణలో రియల్ ఫైట్ ఇక ప్రారంభమైంది. అభ్యర్థులను మూడు నెలల ముందుగానే బీఆర్ఎస్ ప్రకటించడంతో ఇన్నాళ్లు తెలంగాణలో ప్రచారం వన్ సైడ్‌గానే సాగింది. మూడు ప్రధాన పార్టీలు అభ్యర్థులను దాదాపు ప్రకటించడంతో ఇక ఫైట్ తీవ్రరూపం దాల్చనుంది. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి అభ్యర్థులను ముందుగా ప్రకటించమని స్పష్టంగా ప్రకటించిన బీజేపీ, తెలంగాణ విషయంలో మాత్రం కొత్త వ్యూహాన్ని అమలు చేస్తోంది. తాము అధికారంలోకి వస్తే బీసీ నేతను సీఎంగా నియమిస్తామని బీజేపీ ప్రకటించింది. కులగణన జరగాలని డిమాండ్ ఒక వైపు, దేశంలో బీసీ జనాభా సంఖ్య 50 శాతం కంటే ఎక్కువుందని వినిపిస్తున్న మాటల మధ్య బీసీ నినాదం, ఈ ఎన్నికల్లో కీలకంగా మారడం తథ్యంగా కనిపిస్తోంది. 2014లో బీఆర్ఎస్‌కు 41శాతం, కాంగ్రెస్‌కు 25శాతం, బీజేపీకి (టీడీపీ పొత్తుతో) 23శాతం, 2018లో బీఆర్ఎస్‌కు 50శాతం, కాంగ్రెస్‌కు 29శాతం, బీజేపీకి 9శాతం మంది, 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 41, కాంగ్రెస్‌కు 25, బీజేపీకి 25 శాతం మంది బీసీలు మద్దతిచ్చారు. బీసీల మద్దతు కారణంగానే 2014, 2018లో బీఆర్ఎస్ పార్టీ అధికారపగ్గాలు చేపట్టగలిగింది. 2019 ఎన్నికల్లో బీజేపీకి ఎన్నడూ లేని విధంగా 19 శాతం మద్దతు ఇవ్వడం వల్లనే ఆ పార్టీ 4 ఎంపీ స్థానాలను గెలుపొందింది. ఈ విషయాన్ని గ్రహించే 2019 ఎన్నికల తర్వాత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీ అయిన బండి సంజయ్‌ను పెట్టారు. ఆయన నియామకం తర్వాత బీసీల్లో కొంత కదలిక వచ్చి వారు బీజేపీ వైపు మొగ్గు మొదలైంది. ముఖ్యంగా మున్నూరు కాపు సామాజికవర్గంలో అయితే సంజయ్‌ను తొలగించడంతో బీసీ సామాజిక వర్గంలో ఇప్పటికీ అసంతృప్తి నెలకొంది.

ఎక్కువ సీట్లు కేటాయించిన బీజేపీ..

బీసీలకు పెద్ద పీట వేసే పార్టీ తమదని బీజేపీ నేతలు ధంకా బజాయించి చెప్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కంటే తామే ఎక్కువ టికెట్లు బీసీలకు కేటాయించామని గొప్పగా చెప్తున్నారు. తెలంగాణలో బీసీ కార్పొరేషన్, ఫెడరేషన్‌లో బడ్జెట్‌లో నిధులు కేటాయింపు తప్పా, విడుదల చేసిన పాపాన పోలేదని బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్ ఇటీవల ఆరోపించారు. బడుగు బలహీనవర్గాలకు రాజ్యాధికారం కల్పించడమే ధ్యేయంగా బీజేపీ పనిచేస్తుందని లక్ష్మణ్ అన్నారు.

బీసీలకు ప్రాధాన్యమివ్వని బీఆర్ఎస్

బీఆర్ఎస్ పార్టీ తమది పూర్తిగా బీసీల పార్టీ అని మాటలు చెప్తున్నా.. ప్రాధాన్యం ఇవ్వడంలో మాత్రం కనిపించడం లేదు. బీసీలను కేవలం తాయిలాలతోనే ఆకట్టుకోవాలని వారి టికెట్ల కేటాయింపు చూస్తే అర్థమవుతోంది. బీఆర్ఎస్ మంత్రి వర్గంలో తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, గంగుల వంటి బలమైన బీసీ నేతలున్నా, వారికి డిప్యూటీ సీఎం పదవి, ప్రధాన శాఖలు దక్కకపోవడంపై కొంత అసంతృప్తిగానే ఉన్నారు. అయితే దేశ వ్యాప్తంగా కుల జనగణన చేపట్టాలని డిమాండ్ చేస్తున్న పార్టీల్లో బీఆర్ఎస్ కూడా ఒకటి. మరి అదే బీఆర్ఎస్ రాష్ట్రంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే లెక్కల ప్రకారం బీసీలకు రాజకీయంగా సమన్యాయం ఎందుకు చేయడం లేదనే ప్రశ్నలను విపక్షాలు లేవనెత్తుతున్నాయి. బీసీలను ఆకర్షించడం కోసం చేయూత పేరుతో లక్ష రూపాయల సాయం పథకం ప్రభుత్వం ప్రకటించింది. బీసీల్లో వందకుపైగా కులాలుండగా కేవలం 15 కులాలకు మాత్రమే ప్రయోజనం చేకూర్చే విధంగా ప్రభుత్వం ఆ స్కీం ప్రవేశపెట్టిందనే విమర్శలున్నాయి. దీంతో బీసీల్లో ఉన్న అసంతృప్తికి చెక్‌పెట్టేలా 'బీసీ గర్జన' చేపట్టి బీసీ ఓట్లకు గాలం వేయాలని చూసినా అది వర్కవుట్‌కాలేదు.

రాష్ట్ర విభజన జరిగిన తరువాత ఇప్పటివరకు తెలంగాణ అసెంబ్లీలో బీసీ సామాజిక ఎమ్మెల్యేల సంఖ్యను పరిశీలిస్తే 2004లో 17 మంది, 2009లో 25 మంది, 2014లో 20 మంది, 2018లో 22 మంది ఎమ్మెల్యేలు వివిధ పార్టీల తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎన్నికల సమయంలో బీసీ కార్డుతో పబ్బం గడుపుకోకుండా బీసీ సామాజిక నేతలు కోరుతున్న విధంగా జనాభా ప్రాతిపదికన న్యాయం జరగాలంటే ఈ సారైనా.. బీసీలు చైతన్యం అయ్యి ఎక్కువ ప్రాతినిధ్యం కల్పిస్తున్న బీసీలకు మెజారిటీ ప్రాతినిధ్యం కల్పించే పార్టీలనే గెలిపించుకోవాలని బీసీ సంఘాల నేతలు కోరుతున్నారు. చూడాలి మరీ తెలంగాణలోని బీసీ ఓటర్లు ఎవరిని కనికరిస్తారో..!

> **కులగణనే అస్త్రంగా 'హస్తం' పార్టీ..**
>
> దేశవ్యాప్తంగా కులగణన చేపట్టేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నిరాకరిస్తున్నారని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే దేశమంతా కులగణన చేపడతామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అంటున్నారు. బీసీలకు రాజ్యాధికారం దక్కరాదనే ఆలోచనతోనే తెలంగాణలో బీఆర్ఎస్, జాతీయ స్థాయిలో బీజేపీ కులగణనను అడ్డుకుంటోందని రాహుల్ ఆరోపిస్తున్నారు. అదే సమయంలో తెలంగాణలో బీసీ సీఎం అన్న బీజేపీ మాటలను అపహాస్యం చేశారు. అసలు అది సాధ్యం కాదని మాట్లాడారు. తెలంగాణలో బీజేపీకి ఉన్నది రెండు శాతం ఓట్లేనని రాహుల్ విమర్శించారు. అదే సమయంలో బీసీ సీఎం విషయంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలను బీజేపీ తప్పుబడుతోంది. యావత్ తెలంగాణ బీసీలను రాహుల్ అవమానించారని బీజేపీ ఆరోపిస్తోంది.